
లక్కవరం రోడ్డు దుస్థితి ఇలా..


రమణాలవారిపాలెం నుంచి తాళ్లూరు వెళ్లే రోడ్డులో నిలిచిన నీరు

అసలే గుంతలు..ఆపై భారీ వర్షాలు

- తాళ్లూరు మండలంలో అధ్వానంగా రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


ప్రమాదకరంగా తాళ్లూరు-విఠలాపురం రోడ్డు

తాళ్లూరు: మండలంలో రోడ్లు అధ్వానంగా ఉండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై అడుగుకో గుంత దర్శనమిస్తోంది. రోడ్లపై వాహనదారులు ప్రయాణించాలంటే భయపడుతున్నారు. మామూలుగానే అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లపై ఎక్కడ పంక్చర్లు అవుతాయోనని వాహనదారులు ఆందోళన చెందుతుంటారు. పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షం నీరు చేరి ప్రయాణం మరింత కష్టంగా మారింది. లక్కవరం -దోసకాయలపాడు, రమణాలవారిపాలెం-విఠలాపురం గ్రామాల రోడ్లపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, పంట పొలాలకు వెళ్లే రైతుల ప్రయాణం చేయాలంటే నరకంగా ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో రోడ్లు వేసి వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలు తొలగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల దుస్థితి మరీ దారుణంగా ఉంది. కనీసం మరమ్మతుల పనులు కూడా చేపట్ట లేదు. మహిళలు, వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు రోడ్లపై ప్రయాణించడం కష్టంగా ఉంది. ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. మరీ ముఖ్యంగా రమణాలవారిపాలెం-విఠలాపురం గ్రామాలకు చెందిన ప్రజలు మన్నేపల్లి మీదగా తూర్పుగంగవరానికి వెళ్లాల్సి ఉంది. ఈ గుంతల్లో వర్షం నీరు నిలిచి ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు పటించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా రోడ్లు మాత్రం వేయడం లేదని పలువురు మండిపడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి



రోడ్డుపై వర్షం నీరు చేరడంతో ప్రజలు ప్రయాణం చేయాలంటే కష్టంగా ఉంది. వైఎస్సార్ సీపీ హయాంలో రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా రోడ్ల గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. వాహనాలు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయి.

– కైపు వెంకటేశ్వరరెడ్డి, రమణాలవారిపాలెం

ప్రయాణించాలంటే నరకంగా ఉంది:



మా గ్రామం నుంచి దోసకాయలపాడు వెళ్లే రోడ్డు మార్గం అధ్వానంగా ఉంది. ప్రజలు వాహనాలపై దర్శి, తూర్పుగంగవరం నిత్యం అధిక సంఖ్యలో వెళ్తుంటారు. రోడ్లపై గుంతలు పడటంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంది. వెంటనే అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి.

– రావినూతల పేతురు, లక్కవరం

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడో?


రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

దొనకొండ: దొనకొండ-గజ్జలకొండ రోడ్డు పరిస్థితి దయనీయంగా మారింది. వర్షానికి అడుగడుగుకు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ రోడ్డు బాగుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు వస్తుందోనని గ్రామాల్లోని ప్రజలు ఎదురు చూస్తున్నారు. పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో రోడ్డు బురదమయమైంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్‌లు నిత్యం ఈ రోడ్డు నుంచి అధిక సంఖ్యలో ప్రయాణం సాగిస్తుంటాయి. ఇండ్లచెరువు, గజ్జలకొండ, నాగిరెడ్డిపల్లి, పోతలపాడు, గానుగపెంట తదితర గ్రామాల ప్రజలు నిత్యం వాహనాలపై వెళ్తుంటారు. ఇటీవల ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. అంతే కాకుండా ఆటోలు ప్రమాదానికి చోటు చేసుకున్నాయి. రాత్రి పూట ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ఎదురు వచ్చే వాహనాలు తప్పించబోయి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. గ్రామాల్లోని ప్రజలు నిత్యం మండల కేంద్రం దొనకొండకు అనేక పనుల మీద తరుచూ వస్తుంటారు. అంతేకాకుండా రైతులు పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఎన్నోసార్లు అధికారులకు తెలియజేసినా ఉపయోగం లేకుండా పోతోంది. ఈ రోడ్డు పంచాయతీరాజ్ ఆధీనంలో ఉంది. ఆర్‌అండ్‌బీకి మార్చాలని సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి గళమెత్తారు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేపట్టి వాహన చోదకులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాల్సిన అవసరం ఉందని గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి:



రోడ్డు అధ్వానంగా తయారవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దొనకొండ నుంచి రాత్రి వేళల్లో గ్రామానికి చేరుకోవాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. వాహనాలు కిరాయికి రావడం లేదు. రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేయించాలి.

– పైడిపోగు రామయ్య, మాజీ సర్పంచ్, ఇండ్లచెరువు

వర్షాకాలం ఇబ్బందికరంగా ఉంది:



నిత్యం ఈ రోడ్డు నుంచి వ్యవసాయ పనులకు వెళ్లాల్సి ఉంది. వర్షం పడిన సమయంలో చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. మండల కేంద్రం దొనకొండకు, వ్యవసాయ పనులపై మార్కాపురం వెళ్లాలంటే ఈ రోడ్డే దిక్కు. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టి వాహన చోదకులకు, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– పత్తికొండ వెంకట సుబ్బయ్య, మాజీ సర్పంచ్, ఇండ్లచెరువు

క్లుప్తంగా

జాషువా జయంతిని జయప్రదం చేయాలి

దర్శి: మహాకవి గుర్రం జాషువా జయంతి సభను జయప్రదం చేయాలని దళిత నాయకులు ప్రేమ్ కుమార్, గోవింద్ ప్రసాద్ కోరారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శనివారం తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు దర్శి ఎంపీడీవో ఆఫీస్ ఆవరణంలో మహాకవి గుర్రం జాషువా జయంతి సభ జరుగుతుందని చెప్పారు. జయంతి సభలో గుర్రం జాషువా పద్యాలు ఆలపించే కళాకారులు తమ పేరు నమోదు చేసుకొని ఎంట్రీ ఫీజు చెల్లించాలని కోరారు. ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు, రాచపూడి మోషే, గుడిమెట్ల నెమ్మేష్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు వినియోగించుకోవాలి

దర్శి: రైతులకు ఇచ్చే శిక్షణ తరగతులను వినియోగించుకుని వ్యవసాయంలో అభ్యున్నతి సాధించాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ అన్నారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం షెడ్యూల్ క్యాస్ట్ రైతులకు మినుము పంటపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ గిరిజన, షెడ్యూల్డ్ క్యాస్ట్ రైతుల అభ్యున్నతికి తోడ్పడాలనే ఉద్దేశంతో దేశంలోని అన్నీ కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా వారికి అవసరమైన శిక్షణ, నైపుణ్య వృత్తి విద్య కార్యక్రమాలు నిర్వహించి చిరు వ్యాపారులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కొన్నేళ్ల నుంచి దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా గిరిజన రైతులు, షెడ్యూల్డ్ క్యాస్ట్ రైతులకు అవసరమైన వివిధ వ్యవసాయ పంటల విత్తనాలు, కూరగాయల మొక్కలు, వివిధ జాతుల కోడి పిల్లలు, పురుగు మందులు పిచికారి చేసుకొనే బ్యాటరీ, పవర్ స్ప్రేయర్స్, ధాన్యం నూర్పిడికి, తర్పాలిన్ పట్టలు అందించినట్లు వివరించారు. సేద్యపు విభాగ శాస్త్రవేత్త డాక్టర్ తూము వెంకటేశ్వరరెడ్డి, సింగన్నపాలెం, అలవలపాడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కూటమిది అరాచక, అవినీతి ప్రభుత్వం


శివరామపురంలో కూటమి మోసాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లూరు: రాష్ట్రంలో కూటమిది అరాచక, అవినీతి ప్రభుత్వమని, సంక్షేమ పథకాలను అమలు చేయకుండా గాలికి వదిలేసిందని మండల పార్టీ అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్ రెడ్డి, యువజన నాయకుడు కొర్రపాటి విష్ణు, మాజీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవి.సుబ్బారెడ్డి, సర్పంచ్ బొడ్డు రాములు అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని మాధవరం, కొర్రపాటివారిపాలెం, శివరామపురం గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కొర్రపాటివారిపాలెంలో ఇటీవల క్యాన్సర్ సోకి ఆపరేషన్ చేయించుకున్న పార్టీ దళిత నాయకుడు సంఘం ధర్మేంద్రను నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనా రెడ్డి, ఆలోకం హరిబాబు, నియోజకవర్గ ప్రచార, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు జక్కుల రామకృష్ణ, యత్తపు మధుసూదన్ రెడ్డి, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు గవ్వల శ్రీనివాస రెడ్డి, పులి రమణారెడ్డి, నాగుళ్ల వెంకట్రావు, నారాయణ శెట్టయ్య, యామర్తి ప్రభుదాస్ సర్పంచ్‌లు కోటా వెంకటరామి రెడ్డి, షేక్ వలి, ఎంపీటీసీ యోహాన్, మాజీ జెడ్పీటీసీ లోకిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మండల నాయకులు ఉప్పుటూరి బ్రహ్మయ్య, మన్నం వెంకటేశ్వర్లు, కొర్రపాటి శరత్, గొళ్లపూడి ఎర్రయ్య, పూర్ణయ్య, తూము వెంకటేశ్వర రెడ్డి, ఐ.భాస్కర్ రెడ్డి, సుబ్బారెడ్డి, టి.రేణుక, ఐ.శ్రీనివాసరెడ్డి, కటకం శెట్టి శ్రీనివాసరావు, పూనూరి దేవదానం, కూలూరి అంజిరెడ్డి, కుమ్మిత జయరామి రెడ్డి, బీమినేని సుబ్బారావు, లతీఫ్, గోపు శ్రీనివాసరెడ్డి, కోటా కృష్ణా రెడ్డి, శీలం వెంకారెడ్డి, కొండ్రు ఏసురత్నం, ఐ.శ్రీనివాస రెడ్డి, సోము కృష్ణా రెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటలకు బూస్టర్ డోస్ ఎరువులు వాడాలి

పెద్దారవీడు: పంటలకు బూస్టర్ డోస్ ఎరువులు వేయాలని వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ అన్నారు. మండలం పరిధిలోని మద్దలకట్ట రైతు సేవా కేంద్రంలో శనివారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు, మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షం మిరప, పొగాకు పంటలకు ఎంతో మేలు చేస్తుందని, మొక్కలకు తీసుకోవాల్సిన పోషకాలపై అవగాహన కల్పించారు. పంటలు సాగు చేసిన పొలాల్లో ముందుగా వర్షం నీటిని వెంటనే బయటకు పంపేందుకు గట్లు తెంచాలన్నారు. బూస్టర్ డోస్‌గా ఎకరా పొలానికి 25 కేజీల యూరియా, 25 కేజీల పొటాష్‌తో మిశ్రమం చేసి పైపాటుగా చల్లాలని తెలిపారు. లేదా ఎకరానికి 2 కేజీల పొటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేయాలని చెప్పారు. ప్రస్తుతం తేమ వాతావరణంతో ఆకుమచ్చ తెగులు రాకుండా ఎం45, కారబేండిజిమ్ కలిసి ఉండే మందును లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు.

కంది పంటలో అంతర సేద్యం చేయాలని, కలుపు లేకుండా చేసుకొని డీఏపీ బస్తా ఎరువు వేసుకోవాలన్నారు. మిరప పంటలపై ఎలాంటి బయో మందులు వాడొద్దని రైతులను కోరారు. విశ్వనాథ్, రైతులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

దర్శి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై మురళి సూచించారు. భగత్ సింగ్ 119వ జయంతిని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మాస్టర్ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. భగత సింగ్ చిత్ర పటానకి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మురళి మాట్లాడుతూ నేటి యువత డ్రగ్స్‌ను అంతం చేసేందుకు కంకణం కట్టుకోవాలన్నారు. సమాజంపై అవగాహన కలిగి ఉండి తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం మంచి మార్గంలో నడిచి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా 23 ఏళ్ల వయసులోనే ప్రాణాలు త్యాగం చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు మాట్లాడుతూ అమరుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ వారి అడుగుజాడల్లో నడవాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య, నవులూరు సుధాకర్, పోతురాజు, ఆంజనేయులు, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఆర్‌జేసీ పాల్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే బలమైన కుటుంబం

పెద్దారవీడు: మహిళల ఆరోగ్యంతోనే శక్తివంతమైన కుటుంబం తయారవుతుందని ఎంపీహెచ్‌ఈఓ బి.సత్యమయ్య అన్నారు. మండలంలోని సానికవరం సచివాలయంలో చట్లమిట్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ క్షయ, కుష్టు, క్యాన్సర్, మధుమేహం, అధిక రక్తపోటు, బీపీ తదితర వ్యాధుల నియంత్రణలో ఉంచుకోవడంపై అవగాహన కల్పించారు. ప్రతి మహిళ తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రాథమిక దశలో వ్యాధులను గుర్తిస్తే ఆరంభంలోనే చికిత్సకు వీలవుతుందని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. సర్పంచ్ మూల రమణారెడ్డి, బీజేపీ మండల సీనియర్ నాయకులు బొచ్చు మల్లారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ భరత్ భూషణ్, ల్యాబ్ టెక్నీషియన్ నవీన్‌కుమార్, సీహెచ్‌ఓలు సరస్వతి, చైతన్య, ఆశ కార్యకర్తలు స్వర్ణ, సంతోషమ్మ, ఎస్తేరురాణి, నారాయణమ్మ, రేజినా పాల్గొన్నారు.

వర్షంతో రోడ్డుపై చేరిన మురుగు


రోడ్డుపై చేరిన మురుగు

తాళ్లూరు: మండలంలోని బెల్లంకొండవారిపాలెం గ్రామ ప్రధాన వీధుల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. మరీ ముఖ్యంగా ఎస్సీ కాలనీ జెండా చెట్టు వద్ద రోడ్డుపై మురుగు చేరి దోమలు విజృంభిస్తున్నాయి. దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసిందంటే మోకాళ్లోతు నీరు నిల్వ ఉంటోంది. రైతులు పశుగ్రాసం కోసం ఈ మార్గం నుంచి బైకులపై వెళ్తుంటారు. మోటర్ బైక్ సైలెన్సర్‌లోకి మురుగు నీరు చేరుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రైన్లు నిర్మించక పోవడంతో ఇబ్బందిగా మారింది. పశువుల వ్యర్థాలు దిబ్బలుగా రోడ్డు వెంబడి వేయడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు చెప్తున్నారు.

ఉద్యాన పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


పచ్చిమిరప పంటలో నిలిచిన నీరు

యర్రగొండపాలెం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఉద్యాన పంటలకు మేలు చేకూర్చుతాయని, ఈ వర్షాలతో పంటలకు ఎటువంటి నష్టం జరగదని హెచ్‌వో పి.ఆదిరెడ్డి శనివారం తెలిపారు. నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో ఎక్కువ శాతం వర్షం కురిసిందని, ఈ వర్షంతో పండ్ల తోటల్లో నిలిచిన నీటిని బయటకు పంపాలని, తోటల్లో నీరు నిల్వ చేరడంతో పండ్ల మొక్కల వేర్లు దెబ్బతినే అవకాశం ఉందని, రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టి తమ తోటలను రక్షించుకోవాలని కోరారు. వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేకుంటే 13-0-45 లేదా యూరియా వంటి పోషకాలు పంటపై పిచికారీ చేయాలని, వాలిపోయిన, పడిపోయిన మొక్కలను మట్టి ఎగదోసి చక్కగా నిలబెట్టాలని సూచించారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో భూమిలోని సూక్ష్మ పోషకాలు అందుబాటులో లేకుండా పోతాయని, రైతులు సూక్ష్మ పోషకాల మిశ్రమం 5 గ్రాములు లీటరు నీటికి వారం వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. పొలంలో నీరు నిల్వ చేరితే ఎండు తెగులు ఆశించే అవకాశం ఉందని, కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి లేకుంటే రిడోమిల్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదల్లో పోయాలని చెప్పారు.

అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు

దర్శి: విజయదశమి పండగ రద్దీని క్యాష్ చేసుకునేందుకు ట్రావెల్స్ బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఎంవీఐ రవికుమార్ హెచ్చరించారు. డీటీసీ ఆదేశాల మేరకు బెంగళూరు నుంచి పిడుగురాళ్ల వైపు వెళ్తున్న ప్రైవేటు బస్సులను ఆయన శనివారం తనిఖీ చేశారు. అధిక చార్జీలు వసూలు చేస్తున్న రెండు ట్రావెల్ బస్సులపై కేసులు నమోదు చేశారు. అధిక లోడుతో వెళ్తున్న రెండు లారీలపై కూడా కేసులు నమోదు చేశారు. మొత్తంగా లక్ష రూపాయల జరిమానా విధించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దసరా సెలవులను అడ్డు పెట్టుకుని బెంగళూరు, హైదరాబాద్‌ల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల వద్ద అధిక ధరలు టిక్కెట్ రూపంలో వసూలు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం మంచిదికాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, వాహనాలు ఫిట్‌నెస్ సరిగా లేకున్నా సహించేది లేదన్నారు. డీటీసీ ఆదేశాల మేరకు రోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని ఎంవీఐ చెప్పారు.

గాయత్రీదేవిగా కనకదుర్గమ్మ


కురిచేడు: ధనలక్ష్మీదేవిగా..


దర్శి: గాయత్రీదేవిగా కనకదుర్గమ్మ తల్లి


త్రిపురాంతకం: స్కందమాతగా అమ్మవారు


దర్శి: కాత్యాయనీదేవిగా దద్దాలమ్మ

సాక్షి నెట్‌వర్క్: దేవీ నవరాత్రి ఉత్సవాలు దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను పూలమాలలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం చేశారు. దర్శిలో కనకదుర్గమ్మ తల్లి గాయత్రీదేవి అమ్మవారుగా దర్శనం ఇచ్చారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనం ఇచ్చారు. వైపాలెంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దొనకొండలో ఆనంద ఆశ్రమంలో వెలసిన జగన్మాత ఈశ్వరీ మహాదేవి శాకాంబరీగా దర్శనమిచ్చారు. పెద్దదోర్నాలలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీమాతకు క్షీరాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. పెద్దారవీడు మండలం గొబ్బాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కురిచేడులో జ్ఞానప్రసూనాంబదేవి ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.


పెద్దదోర్నాలలో లలితాదేవి అలంకారంలో అమ్మవారు


దొనకొండలో పూజలు చేస్తున్న భక్తులు


పోలేరమ్మ ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు


పెద్దారవీడు: రాజ్యలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దర్శి: పట్టణంలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ సచిన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌లు మరమ్మతులు చేస్తున్న కారణంగా అద్దంకి రోడ్డు, సీఐ కార్యాలయం, ఆటోనగర్, గంగవరం రోడ్డు, పుచ్చలమిట్టలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తూర్పుగంగవరం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులతో హెచ్‌ఎం, పీడీ

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం హైస్కూల్ విద్యార్థులు సిరిగిరి రవితేజ, చాట్ల జగదీష్‌లు సాఫ్ట్‌బాల్ క్రీడలో జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. శుక్రవారం టంగుటూరులో జరిగిన సబ్ జూనియర్స్ అండర్-14 కేటగిరిలో సాఫ్ట్‌బాల్ క్రీడలో ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయికి ఎంపికైన వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌కే ప్రసాద్, పీడీ శివనాగరాజు, తల్లిదండ్రులు అభినందించారు.